క్లుప్తంగా

సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోండి

మద్దూరు: మహిళలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం నారాయణ సూచించారు. మండలంలోని అన్ని గ్రామా సంఘాల్లో ఐకేపీ అధికారులు బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను ఐకేపీ ఏపీఎం నారాయణ వివరించారు. వడ్డీ లేని రుణాల చెల్లింపులు, బీమా పథకాలు, బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ల నిర్వహణ, వరి కొనుగోలు కేంద్రాలు, పెరటి కోళ్ల పెంపకం, అమ్మ ఆదర్శ కమిటీలు, తదితర అంశాల గురించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



ధన్వాడ: మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 9.00 గంటలకు ప్రారంభం కావాల్సిన పాఠశాల 9.20 గంటలు అయినా తెరుచుకోలేదు. 9.30 గంటలకు పాఠశాలకు వచ్చిన ఒక విద్యార్థి గేటు తాళం తెరిచింది. ఈ విషయంపై ఎంఈఓ గాయత్రిని వివరణ కోరగా ఉపాధ్యాయులతో మాట్లాడి ఆలస్యానికి గల కారణాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామన్నారు.

పాఠశాలల తనిఖీ

ధన్వాడ: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను బుధవారం ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఎంఈఓ గాయత్రీలు తనిఖీ చేశారు. ఉర్దూ మీడియం పాఠశాలలో అదనపు గదులు నిర్మాణం పూర్తి అయిన ఇంక అందుబాటులోకి తేలేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పడంతో పెండిగ్ బిల్లులను త్వరగ విడుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ రిపేరు చేయించి త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

మాగనూర్: లయన్స్ క్లబ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వడ్వాట్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 35 మందికి కంటి పొరల సమస్యలు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ నిమిత్తం రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, కృష్ణమూర్తి, చిన్నకిష్టప్ప, నూరుద్దీన్, గోపాల్‌రెడ్డి, జానప్ప, రాఘవరెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యలపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏడు దశాబ్దాలుగా నిరంతరం పోరాటం చేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహ మరాఠి వెంకట్రాములు, చంద్రకాంత్, తపస్ నాయకులు జట్రం కరుణాకర్ అన్నారు. ఏబీవీపీ విద్యార్థి సంఘం 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఏబీవీపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. అందరం సంఘటితంగా ఉండి జాతి పునర్నిర్మాణానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

హెల్త్ స్కీమ్ బకాయిలు చెల్లించాలి



మాగనూర్: ఉద్యోగ ఉపాధ్యాయుల హెల్త్ స్కీమ్ బకాయిలు బిల్లులను వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కస్తూర్బా పాఠశాలతో పాటు ఇతర పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ మెంబర్‌షిప్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో టీఎస్ యూటీఫ్ సంఘం ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సంఘం మండల అధ్యక్షుడు రాఘవేంద్ర చారీ, మండల ప్రధాన కార్యదర్శి నాగేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కొత్తపల్లి: మండల కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన సమీకృత భవన నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. పనులు నత్తనడకన కొనసాగుతుండడంపై బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. కొడంగల్ కాడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. రూ.8.80 కోట్లతో నిర్మాణం చేపట్టిన కాంప్లెక్స్ భవన నిర్మాణం నాలుగు నెలల నుంచి పిల్లర్ల దశలోనే కొనసాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తేదారును పిలిచి మందలించారు. సమీపంలోనే చెరువు ఉందని చెరువు నీళ్లు మండల కాప్లెక్స్ ఆవరణలోకి వచ్చే అవకాశం ఉందని నాయకులు చెప్పడంతో స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ అధికారుల రిపోర్ట్ తీసుకోవాలని పంచాయతీరాజ్ ఉన్న తాధికారులకు సూచించి పరిష్కార మార్గం చూపాలన్నారు. అనంతరం మండల పరిధిలోని భూనీడులో నిర్మాణమయ్యే ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అదే ఆవరణలో కొనసాగే ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ జయరాములు, పంచాయతీ రాజ్ డీఈ విలోక్, ఏఈ అంజిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింములు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తపల్లి: మండలకేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై మూడు రోజుల క్రితం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు విస్తరణలో భాగంగా గుండుమాల్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ మట్టిలో కూరుకుపోయింది. మేత మేయడానికి వెళ్లి మూగజీవాలు విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. దీంతో 'విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం' శీర్షికతో వార్తను ప్రచురించగా మంగళవారం మండల విద్యుత్ ఏఈ బాల్‌రాజ్ సిబ్బందితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. మట్టిలో కూరుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డుకు దూరంగా వేరే స్తంభానికి అమర్చారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే స్తంభానికి బిగిస్తున్న అధికారులు

పంటకు బీమా ఏది..?

- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు
- క్రాప్ ఇన్సూరెన్స్ నదుపాయం లేక అన్నదాతల అవస్థలు



వరదనీటిలో కొట్టుకుపోయిన వరి పంటను చూపిస్తున్న రైతు (ఫైల్)

మరికల్: ప్రకృతి వైపరీత్యాలు రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. రూ.లక్షలు అప్పు చేసి సాగు చేసిన పంటలు అతివృష్టి, అనావృష్టి కారణంగా అన్నదాతలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం మొండి చేయి చూపిస్తోంది. పరిహారం అందకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. పంట బీమాపై అవగాహన లేకపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. వర్షాధార పంటల బీమా పథకం రాష్ట్రంలో రెండేళ్లుగా అమలు కావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రాప్ ఇన్సూరెన్స్‌పై స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి రైతులు పత్తి, వరి, కంది, జొన్న, తదితర పంటలు సాగు చేశారు. కానీ వీటికి బీమా సౌకర్యం లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

పంటల బీమాకు మంగళం

రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం పంటబీమా పథకాన్ని పక్కన పెట్టింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని అమలుచేయడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్న దుస్థితి నెలకొంది. అసలు ఈ పథకాన్ని ఎందుకు నిలిపివేశారనే విషయంపై అధికారులకు సైతం స్పష్టత లేదు. నష్టానికి సంబంధించిన ఫోటోలు తీసి పంపిస్తే చాలు పరిహారం అందిస్తామనేలా గతంలో ప్రచారం చేశారు. కానీ ఆచరణలో మాత్రం ఎక్కడా ఇది అమలు కావడం లేదు. అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు అధికారులు సర్వేలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

30వేల ఎకరాల్లో పంట నష్టం

పంటల బీమా చేయించుకునేందుకు రైతులు ఆసక్తిగా ఉన్నప్పటికీ ప్రభుత్వాలు సహకరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 2018 డిసెంబర్ నుంచి సాధారణ పంటల బీమాతో పాటు వాతావరణ ఆధారిత బీమా పథకాలు అమలుకు నోచుకోవడం లేదు. క్రాప్ ఇన్సురెన్స్ కోసం రైతులు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగి నిరాశకు గురవుతున్నారు. గత రెండేళ్లుగా వర్షాలు అధికంగా కురవడంతో పత్తి, వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. కానీ ఎక్కడ కూడా ప్రభుత్వం నుంచి ఒక రూపాయి కూడా నష్ట పరిహారం అందలేదు. గతేడాది కురిసిన వర్షాల వల్ల నియోజకవర్గంలో దాదాపు 30 వేలకు పైగా ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం జరిగింది.

నష్ట పరిహారం అందజేయాలి



ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటలకు ప్రభుత్వం బీమా పథకం అమలు చేయాలి. రెండేళ్లుగా అతివృష్టి కారణంగా పంటలకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రకృతి వల్ల రెండేళ్ల నుంచి రూ. లక్షకు పైగా నష్టం వాటిల్లింది. భవిష్యత్‌లో పంటలకు సంబంధించిన బీమా పథకం ఉండేలా చర్యలు తీసుకుంటే కొద్ది వరకైనా పంట బీమా ద్వారా నష్ట పరిహారం అందిస్తే ఆసరాగా ఉంటుంది.

– రవి, పత్తి రైతు, మరికల్

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే పంటల బీమా ప్రక్రియ ప్రారంభిస్తాం. ప్రస్తుతం బీమా సౌకర్యం లేదు. కొన్నాళ్ల నుంచి ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. వర్షాలు కురుస్తున్నప్పటికీ రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. గతేడాది పంట నష్టం వివరాలపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం.

– జాన్ సుధాకార్, జిల్లా వ్యవసాయ అధికారి, నారాయణపేట

రెవెన్యూ శాఖలో బదిలీల పర్వం



మద్దూరు తహసీల్దార్ కార్యాలయం

మద్దూరు: మండల రెవెన్యూ శాఖలో క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులు బదిలీలు కొనసాగుతున్నాయి. గత నెల 23న మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్‌ఐ, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్‌ను బదిలీ చేశారు. ఈ నెల 8న జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన భూ భారతి ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో రెవెన్యూ కార్యాలయంలో బదిలీల పర్వం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినా భూ భారతి కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా మద్దూరు మండలాన్ని ఎంపిక చేశారు. ఇందులో వచ్చిన దరఖాస్తుల పరిశీలన తదితర అంశాల్లో కింది స్థాయి సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోలేదని ఆరోపణలు రావడంతో పలువురు సిబ్బందిపై బదిలీ వేటు పడినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని తహసీల్దార్ మహేష్‌గౌడ్‌ను వివరణ కోరగా లాంగ్ స్టాండింగ్ ఉన్న వారికి బదిలీలు జరిగినట్లు వివరించారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

మాగనూర్: సైబర్ నేరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాగనూర్ ఎస్‌ఐ అశోక్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏటీఎం కార్డుల ద్వారా డబ్బులు డ్రా చేసిస్తామని చెప్పి కార్డులు మార్చడం, ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం లాంటి యాప్‌ల ద్వారా డబ్బులు కోల్పోవడం, వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో వచ్చే లింక్‌లను క్లిక్ చేస్తే మోసపోవడం గ్యారెంటీ అన్నారు. ఎవరైనా మోసపోతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.



సైబర్ నేరాలపై అవగహన కల్పిస్తున్న ఎస్‌ఐ అశోక్‌బాబు

కార్యక్రమంలో ఏఎస్‌ఐ మన్నన్ , హెడ్ కానిస్టేబుల్ ఉమేష్‌గౌడ్, సిబ్బంది శివ పాల్గొన్నారు.

బాలికలకు అండగా 'షీ టీం'

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో బాలికలకు అండగా షీ టీం ఉందని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీ పాఠశాలలో బుధవారం షీ టీం సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న సమయంలో పోకిరీలు ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, మాయమాటలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చిన డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అలగే ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, జ్యోతి, కవిత, డీఎస్‌ఓ భానుప్రకాష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

పాత సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోవాలి

నారాయణపేట రూరల్: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల విషయంలో తమ ఎస్జీటీ సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని 2002లో స్కూల్ అసిస్టెంట్లుగా చేరిన ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ నరసింహ రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2002 అక్టోబర్ 17న నేరుగా స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికైన వారి కంటే ముందు ఎస్జీటీలుగా కొనసాగుతూ 2002 నవంబర్‌లో స్కూల్ అసిస్టెంట్ లుగా పదోన్నతి పొందిన వారిని సీనియారిటీ జాబితాలో ముందు వరుసలో ఉంచాలని కోరారు. 1989, 1994, 1996, 1998లలో ఉద్యోగాలు పొంది విద్యారంగంలో సర్వీసు అందించిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అప్పట్లోనే అపాట్ (ఏపీఏటి) ను ఆశ్రయించగా తమ తర్వాత స్థానంలో కొత్త వారిని కొనసాగిస్తున్నారని, నాడు తుది తీర్పు వెలువడకుండా సర్వీసులోకి వచ్చిన వారు తమకంటే సీనియర్లుగా పరిగణించ బడరని చెప్పుకొచ్చారు. నియామక ఉత్తర్వులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటప్ప, తిరుపతయ్య, లక్ష్మీబాయి, జ్యోతి, తిప్పన్న, కనకప్ప పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

జలశక్తి అభియాన్ పనుల పరిశీలన



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కేంద్ర జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం కేంద్ర భూగర్భ జల బోర్డు దక్షిణ రీజన్ శాస్త్రవేత్త యాదయ్య పరిశీలించారు. ఉపాధిహామీ ద్వారా చేపట్టిన కందకాలు, రూఫ్ టాఫ్ హార్వేస్టింగ్, స్ట్రక్చర్ నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట డీఆర్‌డీపీ ఎంబీసీ అధికారి వినయ్‌చ ఈసీ రవికుమార్, నయిం, స్వామి, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఔషధ మొక్కలకు ప్రాధాన్యత ఇద్దాం

నారాయణపేట రూరల్: హరితహారంలో ఔషధ మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఫీ యుద్దీన్ సూచించారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో మండలంలోని జాజాపూర్ జడ్పీ పాఠశాలలో బుధవారం స్కూల్ ఎర్త్ క్లబ్స్ యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని పాఠశాలలో ఔషధ వనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఔషధ మొక్కల విలువల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరి ఇంట్లో ఔషధ మొక్కలు పెంచుకోవాలని వాటి విలువలు తెలుసుకోవాలని సూచించారు. అలాగే నీటి ప్రాధాన్యతను తెలియజేసి నీటి వృథాను అరికట్టాలని సూచించారు. అలాగే ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

సాక్షి నెట్‌వర్క్: కేంద్రం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాలు సమ్మె నిర్వహించాయి. నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేంద్రం తీరును ఖండించాయి.

- నర్వలో కార్మికులు, రైతులు అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
- మద్దూరులో అఖిల భారత ఐక్య రైతు కూలీ సంఘం, సీఐటీయూ, టీయూసీఐ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేట్లకు అనుకూలంగా లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని విమర్శించారు. వెంటనే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేసి స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.



మాగనూర్‌లో కార్మికుల సంఘాల రాస్తారోకో

- కృష్ణా మండలంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు వరకు టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ బుట్టో మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనివేళలను పెంచితే భవిష్యత్‌లో మరిన్ని సమ్మెలు చేపట్టి కేంద్రం మెడలు వంచుతామన్నారు.



నర్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

- మరికల్‌లోని చౌరస్తాలో సీఐటీయూ, టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశ, పంచాయతీ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులకు నష్టం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆపమని కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు.
- ధన్వాడ మండల కేంద్రంలో ప్రధన రహదారిపై కార్మిక సంఘం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం అంటే కార్మికుల హక్కులను హరించడమే అని దుయ్యబట్టారు.
- మక్తల్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డి, టీయూసీఐ రాష్ట్ర కోశాధికారి కిరణ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.
- మాగనూర్ మండల కేంద్రంలో వివిధ కార్మిక సంఘాలు బస్టాండ్ చౌరస్తాలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశాయి.



మక్తల్‌లో కార్మిక సంఘాల నిరసన

- కొత్తపల్లిలో టీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నిత్యావసర ధరలు తగ్గించాలని కోరారు. కార్మికులకు ఆమోద యోగ్యమైన చట్టాలు అమలయ్యేదాక పోరాటాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.
- కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు.



ధన్వాడలో..

- నారాయణపేటలోని సర్కిల్ కార్యాలయం ముందు విద్యుత్ శాఖ ఉద్యోగులు విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. 'సేవ్ పవర్ సెక్టార్' అంటూ నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణనువిరమించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

మాగనూర్: విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచిస్థాయికి చేరకోవాలని మాగనూర్ మండల ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన కొత్తపల్లి పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించినప్పుడే ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చన్నారు. సమాజంలో జీవితాలను మార్చేది చదువేనని చదువు చాలా గొప్పదని దానికి కులం, మతం, జాతి అనే తేడాలు ఉండవని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంఘాల ఏర్పాటుకు కృషి చేద్దాం

నారాయణపేట రూరల్: కొత్త మహిళా సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలని సీసీ వసంత, పంచాయతీ కార్యదర్శి ఖాదర్ సూచించారు. మండలంలోని కొల్లంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం మహిళా శక్తి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువతులతో పాటు 60ఏళ్ల పైబడిన వారితో ప్రత్యేకంగా కొత్త సంఘాలు తయారు చేయాలన్నారు. గ్రామంలో 102 మహిళా సంఘాలకు రూ.36లక్షల వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయని వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి పద్మ, వీవోఏలు పాల్గొన్నారు.